# 16. అశ్లీలం, వ్యభిచారం

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమైన కుటుంబవ్యవస్థ కుంటుపడుతుంది. ప్రజలకు మనశ్శాంతి కరువైపోతుంది. హత్యలు, ఆత్మ హత్యలు పెరిగిపోతాయి. అందువల్ల ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీల విషయాలపై కూడా ఆంక్షలు విధించి, వాటిని మొగ్గలోనే త్రుంచివేయదలచింది.

పురుషులకు పైజామా ప్యాంటు చీలమండలు వరకైతే పరవాలేదుగాని, అంతకుమించి కిందికి ఉండకూడదు. ఈఆజ్ఞ పడకగది, మరుగుదొడ్లలో ఉన్నప్పుడు తప్ప ఎల్లవేళలా వర్తిస్తుంది. స్త్రీలకు ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప మిగతాశరీరమంతా బట్ట ఉండాలి. ఏదైనా పనిమీద ఇంటినుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలి. ఇలాంటి వస్త్రధారణ వల్ల పరపురుషులంతా, వీరు గౌరవ ప్రదమైన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారివైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటానికి సాహసించలేరు. అశ్లీలం, వ్యభిచారం గురించి ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

“ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు.” (33:59)

“ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికిది చాలా శ్రేష్ఠమైన పద్ధతి. వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు.” (24:30)

“(ముహమ్మద్-స)! విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషులపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడుకోవాలని వారికి చెప్పు.” (24:31)

“ఒక వ్యభిచారి వ్యభిచారిణిని లేదా బహుదైవారాధకురాలిని తప్ప మరెవరినీ వివాహమాడరాదు. అలాగే ఒక వ్యభిచారిణి వ్యభిచారిని లేదా బహుదైవారాధకుడ్ని తప్ప మరెవరినీ వివాహమాడరాదు. విశ్వాసులకు ఇలాంటి వివాహం నిషేధించబడింది.” (24:3)

“వారు తమ భార్యలు, బానిసస్త్రీల విషయంలో తప్ప (ఇతరస్త్రీల విషయంలో) తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (అంటే వ్యభిచారం తదితర అశ్లీలచేష్టలకు పాల్పడరు.) బానిసస్త్రీల విషయంలో వారిపై ఎలాంటి నింద లేదు. అది తప్ప మరేదైనా కోరేవారే హద్దుమీరిన వారవుతారు.” (ఖుర్ఆన్-23:5-7)

ఈ సూక్తిలో వ్యభిచారం, స్వలింగసంపర్కం, ముష్టిమైథునం మొదలైన చేష్టలన్నీ నిషేధించబడ్డాయి. దైవప్రవక్త (స) యువకుల్ని ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశారు:

“యువకుల్లారా! మీలో వివాహబాధ్యతలు నెరవేర్చే శక్తి గలవారు తప్పక వివాహం చేసుకోవాలి. వివాహం దృష్టిని క్రిందికి వాలేలాచేస్తుంది. మర్మాంగాన్ని కాపాడుతుంది. వివాహబాధ్యతలు నెరవేర్చలేని (పెళ్ళి చేసుకోలేని)వారు అప్పుడప్పుడు ఉపవాసం



పాటించాలి. ఉపవాసం కామోద్రేకాల్ని నిగ్రహింపజేస్తుంది.” (బుఖారి, ముస్లిం)

అయితే హస్తప్రయోగం విషయంలో షరీఅత్‌వేత్తల (ఫిఖహ్‌వేత్తల) మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ) దీన్ని ధర్మసమ్మతంగా పరిగణించారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మలై)లు దీన్ని నిషిద్ధం (హరాం)గా పరిగణించారు. హనఫీల దగ్గర ఇది నిషిద్ధం అయినప్పటికీ, తీవ్రమైన కామోద్రేకం కలిగినప్పుడు యాదృచ్ఛికంగా ఈ పని జరిగిపోతే దేవుడు క్షమిస్తాడని ఆశించవచ్చని అంటారు వారు.

ఇస్లాం వ్యభిచారానికి దారితీసే అశ్లీలచేష్టలపై ఆంక్షలు విధించినప్పటికీ వాటన్నిటినీ ఉల్లంఘించి ఎవరైనా వ్యభిచారానికి పాల్పడితే అతనికి చట్టపరమైన శిక్ష విధిస్తుంది. వ్యభిచారం దాదాపు అన్ని మతాల్లోనూ పాపకార్యమే. సభ్యతా నాగరికతల దృష్ట్యా కూడా ప్రతి యుగంలోనూ మానవసమాజాలు దీన్ని చెడ్డవిషయంగానే పరిగణించాయి. మనోవాంఛలకు బానిసలై స్త్రీని సెక్స్‌సింబల్‌గా భావించే కొందరు తప్ప ఎవరూ ఎన్నడూ వ్యభిచారం దుష్కార్యమనే విషయంలో విభేదించలేదు.

మనుస్మృతి ప్రకారం “ఎవరైనా తన కులానికి చెందిన కన్యతో ఆమె అంగీకారంతో వ్యభిచరిస్తే అతనికి ఎలాంటి శిక్ష లేదు. ఆ కన్య తండ్రి ఒప్పుకుంటే ప్రతిఫలం ముట్టజెప్పి ఆమెను పెళ్ళాడవచ్చు. అయితే పురుషుడు నీచకులస్థుడై, కన్య ఉన్నత కులస్థురాలై ఉన్నప్పుడు ఆమెను ఇంటినుండి గెంటేయాలి. పురుషునికి అవయవఖండన శిక్ష విధించాలి. (అధ్యాయం-8, శ్లోక్-365,366). ఆ కన్య బ్రాహ్మణ కులానికి చెందినదైతే ఇది సజీవదహన శిక్షగా మారిపోతుంది. (శ్లోక్-377)

బైబిల్ పాతనిబంధనం ప్రకారం “ఎవరైనా పురుషుడు వివాహిత స్త్రీతో వ్యభిచరిస్తే ఇద్దర్నీ హతమార్చాలి” అని ఉంది. (22,23); మరొక చోట ఇలా ఉంది:“ఎవరైనా నిశ్చితార్థం జరగకుండా ఉన్న కన్యను మభ్యపెట్టి ఆమెతో సంభోగం జరిపితే ఆమెను తప్పకుండా మహర్ ఇచ్చి వివాహం చేసుకోవలసి ఉంటుంది. ఒకవేళ ఆ బాలిక తండ్రి ఆమెను అతనికి ఇవ్వడానికి ఒప్పుకోకపోతే అతను కన్యలకు ఇచ్చేటంత మహర్ ఆమెకు నగదు రూపంలో ఇచ్చివేయాలి.” (అధ్యాయం-22, సూక్తులు-16,17)

అయితే ఈసా (అలైహి)కు చాలా పూర్వమే యూద ధర్మవేత్తలు, నాయకులు, ప్రజలు అందరూ ఈ చట్టాన్ని రద్దు చేశారు. ఇది బైబిల్‌లో వ్రాయబడినప్పటికీ, దీన్ని దైవశాసనం అని భావించబడుతున్నప్పటికీ ఆచరణాత్మకంగా అమలుపరచడం జరిగేది కాదు. ఈసా (అలైహి) సత్యసందేశ ప్రచారం ప్రారంభించినప్పుడు, యూదులు ఆ ఉద్యమాన్ని నిరోధించడానికి చేసిన ప్రయత్నాలన్నీ ఫలించకపోవడంతో వారొక పన్నాగం పన్నారు. ఆయన దగ్గరకు ఒక వ్యభిచారిణి పట్టితెచ్చి ఈమెను గురించి తీర్పుచేయండి అన్నారు. (యూహన్న:అధ్యాయం-8, సూక్తి-1-11). హజ్రత్ ఈసా (అలై) ఆమెను బావిలో గాని, గోతిలోగాని దూకేలా వత్తిడి చేయవచ్చుని; ఒకవేళ ఆయన కనికరించి శిలాశిక్షకు బదులు మరేదైనా శిక్ష విధిస్తే ‘చూడండి, ఈ వింత ప్రవక్తగారు ప్రాపంచిక ప్రయోజనాల కోసం దైవచట్టాన్ని మార్చివేశారు’ అంటూ దుష్ప్రచారం చేయవచ్చుని వారు భావించారు.

హజ్రత్ ఈసా (అలైహి) శిలాశిక్ష విధించారలని చెబితే దానివల్ల ఒకవైపు రోమ్ చట్టాలతో ఘర్షణ వస్తుంది; మరోవైపు 'ఈ ప్రవక్తగారిని నమ్మండి, చూడండి ఇకనుండి తౌరాత్ ధర్మశాస్త్రమంతా మీ వీపులపై, ప్రాణాలపై రుద్దబడుతుంది' అని జనంలో బాగా దుష్ప్రచారం చేయవచ్చని యూదులు ఎత్తుగడ వేశారు. అయితే హజ్రత్ ఈసా (అలై) ఒకేఒక మాటతో వారి ఎత్తుగడను చిత్తుచేశారు. "మీలో ఏపాపం చేయని పవిత్రుడు ఎవరైనా ముందుకు వచ్చి ఈమెపై రాళ్ళు రువ్వండి" అన్నారు ఆయన. ఈమాట విన గానే ఆ యూదమతపండితుల మూకంతా ఒక్కొక్కరే నోరు మూసుకొని వెళ్ళిపోయారు. ధర్మశాస్త్ర సమర్థకుల నైతిక పరిస్థితి బండారం పూర్తిగా బట్టబయలైపోయింది. చివరికి ఆ స్త్రీ ఒక్కతే అక్కడ ఉండిపోయింది. హజ్రత్ ఈసా (అలైహి) ఈ వ్యవహాం గురించి తీర్పు చేయడానికి న్యాయమూర్తిగా రాలేదు. నేరారోపణకు సంబంధించిన సాక్ష్యాలు కూడా ప్రవేశపెట్టబడలేదు. అదీగాక దైవచట్టాలను అమలుపరిచేందుకు ఇస్లామీయ ప్రభుత్వం కూడా లేదు. అందువల్ల ఆయన ఆ స్త్రీకి హితోపదేశం చేసి పంపివేశారు.

ఈ సంఘటనతో పాటు హజ్రత్ ఈసా (అలై) వివిధ సందర్భాలలో చెప్పిన కొన్ని హితోక్తులకు క్రైస్తవులు వక్రభాష్యం చెప్పి వ్యభిచార నేరానికి వేరే రూపం కల్పించారు. వారి దృష్టిలో అవివాహిత పురుషుడు అవివాహిత స్త్రీతో వ్యభిచరిస్తే పాపమే కాని, శిక్షార్హ మైన నేరం కాదు. ఒకవేళ వారిద్దరు లేక ఎవరైనా ఒకరు వివాహితులై ఉంటే మాత్రమే అది నేరం అవుతుంది. దానికి శిక్షేమిటో చూడండి. వ్యభిచారం చేసిన పురుషుడి భార్య తనభర్త తనకు అన్యాయం చేశాడని ఫిర్యాదుచేసి అతన్నుండి విడిపోయే డిక్రీ తీసుకో వచ్చు. ఇక వ్యభిచారం చేసిన స్త్రీ భర్త తనభార్యకు వ్యతిరేకంగా ఫిర్యాదుచేసి విడాకుల డిక్రీ తీసుకోవడమే గాక తనభార్య శీలాన్ని చెడగొట్టిన పురుషుడి నుండి నష్టపరిహారం వసూలుచేసే హక్కు కూడా అతనికుంటుంది. ఇంతవరకు బాగానే ఉందనిపిస్తుంది. కాని అలా డిక్రీ తీసుకున్న ఆ స్త్రీకిగాని, పురుషుడికిగాని పునర్వివాహం చేసుకునే అధికారం లేదు. క్రైస్తవచట్టం ప్రకారం వారిక జీవితాంతం పునర్వివాహం చేసుకోకుండా సన్యాసుల్లా ఉండిపోవాల్సిందే. ఇలా సన్యాసులుగా ఉండదలచినవారు తమ జీవిత భాగస్వాముల విశ్వాసఘాతుక చర్యల్ని గురించి క్రైస్తవన్యాయస్థానంలో ఫిర్యాదు చేసుకో వచ్చు. ఇలాంటి వివిధ భావనలే ఈనాటి పాశ్చాత్య చట్టాలకు ప్రాతిపదికలయ్యాయి. వారి దృష్టిలో వ్యభిచారం అనైతికం, చెడ్డవిషయం, పాపకార్యమే గాని, నేరం మాత్రం కాదు. వారి దగ్గర బలవంతంగా చేసే మానభంగం మాత్రమే నేరమవుతుంది.

వీటన్నిటికి భిన్నంగా ఇస్లాం దృష్టిలో వ్యభిచారం ఎలాంటిదైనా నేరమే. వ్యభిచారి ధర్మ సమ్మతమైన మార్గం వదలి అక్రమానికి పాల్పడినందున అతను ఇహలోకంలో కూడా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఇస్లాం పవిత్రమైన కుటుంబవ్యవస్థ, ఆరోగ్యవంతమైన సమాజం, అశ్లీల రహితమైన సభ్యతాసంస్కృతులను కోరుకుంటుంది. దానికోసం వ్యక్తులలో ఏకదైవరాధనా భావనతోపాటు, పరలోకజవాబుదారీభావన కల్గించి వారిని సంస్కరించడానికి ప్రయత్నిస్తుంది. అప్పటికీ రోగనివారణ కాకపోతే వ్యభిచార నిరోధానికి చివరి ఆయుధంగా మాత్రమే చట్టపరమైన శిక్షలు ప్రతిపాదిస్తుంది.వ్యభిచార నేరానికి కొరడాదెబ్బల శిక్ష / శిలాశిక్ష విధించబడుతుంది. మానభంగం నేరానికి పురుషునికి మాత్రమే శిక్ష ఉంటుంది.



ఇస్లామీయచట్టం ప్రకారం నేరానికి తగినశిక్షే విధించబడాలిగాని, నిందితుడు శిక్ష నుండి తప్పించుకోవడానికి ఏదైనా మూల్యం చెల్లిస్తే అది చెల్లదు. అనేక హదీసుగ్రంథాలలో వచ్చిన ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక యువకుడు ఒకతని దగ్గర జీతానికి పనిచేస్తూ ఓసారి ఆ యజమాని భార్యతో రమించాడు. యువకుని తండ్రి అతని యజమానికి వంద మేకలు, ఒక బానిసస్త్రీని ఇచ్చి సమస్యను పరిష్కరింపజేసుకున్నాడు. అయితే ఈ వ్యవహారం దైవప్రవక్త (సల్లం) దృష్టికి వచ్చినప్పుడు ఆయన యువకుని తండ్రిని పిలిపించి "నీ మేకలు, నీ బానిసరాలు వాపసు తీసుకో. (నీ కొడుక్కు శిక్ష పడుతుంది)" అన్నారు. తరువాత ఆయన వ్యభిచారికి, వ్యభిచారిణికి శిక్ష విధించారు.

దీన్నిబట్టి ఇస్లాంలో పరిహారం, ప్రతిఫలాల ఇచ్చిపుచ్చుకోవడాల ద్వారా సమస్యను తొక్కిపట్టడం నిషిద్ధమని తెలుస్తోంది. అంతేకాదు, స్త్రీ మానానికి ధన కనక వస్తు రూపేణ విలువ కట్టడం కూడా నిషిద్ధమని తెలుస్తోంది.

దైవప్రవక్త (స) గగనపర్యటన (మేరాజ్) సందర్భంలో ఒకచోట కొందరు స్త్రీలు, పురుషులు కన్పించారు. వారికి ఒక వైపున రుచికరమైన ఘుమఘుమలాడే మంచి మాంసం ఉంది. మరోవైపున కుళ్ళిపోయి కంపుకొడ్తున్న మాంసం ఉంది. అయితే ఆ మనుషులు మంచి మాంసం వదలి కంపుకొడ్తున్న మాంసాన్ని తింటున్నారు. దైవప్రవక్త (స) వీళ్ళెవరని అడిగితే, "వీళ్ళు ధర్మసమ్మతమైన భార్యలను, భర్తలను వదలి నిషేధితాలతో తమ కోరికలు తీర్చుకునే స్త్రీ పురుషులు" అని చెప్పారు దైవదూత జిబ్రీల్ (అలైహి).

మహాప్రవక్త ముహమ్మద్ (స)కు దేవుడు ఓసారి కలలో పితృలోకంలో పాపులు అనుభ వించే యాతనలను చూపించాడు. దీన్నిగురించి బుఖారీ గ్రంథంలో ఓ సుదీర్ఘమైన హదీసు ఉంది. దైవప్రవక్తలకు కలలద్వారా చేసే సూచనలు కూడా దివ్యావిష్కృతి (వహీ) స్థాయికి సమానంగా ఉంటాయి. ఆయన తన స్వప్నవిశేషాల్ని గురించి ఇలా తెలియజేశారు :

"నేను రాత్రి ఓ కల గన్నాను. ఆ కలలో ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చారు. వారు నాచేయి పట్టుకొని ముందుకు నడిచారు. అలా మేము ఒక బిలం దగ్గరకు చేరుకున్నాము. అది నేలలో పాతబడిన మట్టిపొయ్యిలా ఉంది. దాని పైభాగం సన్నగా, క్రిందిభాగం వెడల్పు గా ఉంది. అందులో అగ్ని మండుతోంది. ఆ అగ్నిజ్వాలలో దిశమొలలతో ఉన్న కొందరు స్త్రీలు, పురుషులు కాలిపోతున్నారు. ఆ అగ్నిజ్వాలలు పెకి ఎగిసినప్పుడల్లా వాటితో పాటు ఆ స్త్రీలు, పురుషులు కూడా పైకి లేస్తున్నారు. మరికాస్తయితే వారు ఆ పొయ్యి నుండి బయట పడిపోయేవారు. కాని అంతలోనే అగ్నిజ్వాలలు క్రిందికి పోవడం, వాటితోపాటు వారు కూడా పొయ్యిలో క్రిందికి జారిపోవడం జరుగుతోంది. నేను 'ఏమిటీ వ్యవహారం?' అనడిగాను. దానికి వారు 'ముందుకు నడవండి (తర్వాత చెబుతాం)' అన్నారు...'మీరు అగ్ని బిలంలో కాలిపోతున్నవారిని చూశారు కదా, వారు వ్యభిచారులు' అని చెప్పారు వారు."

దేవీభాగవతంలో ఇలా ఉంది: "ఎవరైతే ఒక వ్యక్తిని మోసగించి అతని భార్యను వలలో వేసుకుంటాడో అతడ్ని యతదూతలు అంధకారనిలయమైన నరకంలో పడవేస్తారు. అందులో పడిన మనిషి బాధతో మూల్గుతాడు. అతనక్కడ వెంటనే గుడ్డివాడిగా, పిచ్చివాడిగా మారి పోతాడు. ఇంకా అతను మొదలునరికిన మ్రానులా పడిపోతాడు." (దేవీభాగవతం-8:5,6)